janodaya
# జనోదయ
WWW.JANODAYA.COM
కరీంనగర్ సోమవారం 15.12.2025 సంపుటి:03 సంచిక:14 పేజీలు:08 వెల : 05
Karimnagar Monday 15.12.2025 Volume :03 Issue : 14 Pages : 08 Cost : 05
తెలుగు దినపత్రిక

## కత్తి పట్టుకుని నడిరోడ్డు-పై యువకుడి వీరంగం..
అదుపులోకి తీసుకున్న పోలీసులు




02




# కొనసాగుతున్న రెండో విడత కౌంటింగ్.. ఆధిక్యంలో కాంగ్రెస్ అభ్యర్థులు

**జనోదయ హైదరాబాద్ డిసెంబర్ 15 :**
హైదరాబాద్: తెలంగాణలో రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థుల హవా కొనసాగుతోంది. తొలి విడతలో అత్యధిక స్థానాలు కైవసం చేసుకుని జోష్ మీదున్న ఆపార్టీ.. రెండో విడతలోనూ విజయపరంపర కొనసాగిస్తోంది. 193 మండలాల్లోని 3,911 గ్రామ పంచాయతీ సర్పంచులు, 29,917 వార్డు సభ్యుల పదవులకు ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంటకు పోలింగ్ ముగిసింది. 2 గంటల నుంచి కౌంటింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. రాత్రి 7:30 గంటల వరకు వెలువడిన ఫలితాలను బట్టి.. కాంగ్రెస్ బలపర్చిన సర్పంచి అభ్యర్థులు 1500కు పైగా, భారత రాష్ట్ర సమితి మద్దతుతో 800కు పైగా, భాజపా 190, ఇతరులు 440కు పైగా స్థానాల్లో విజయం సాధించారు.

**లాటరీలో వరించిన విజయం..**
మెదక్ మండలం చీపురుదుబ్బతండా గ్రామ సర్పంచి ఎన్నిక ఫలితం డ్రాలో తేలింది. చీపురుదుబ్బతండా పంచాయతీకి మోటు కాడి తండా, నైలి తండా అనుబంధంగా ఉన్నాయి. మొత్తం 3 తండాల్లో కలిపి 377 ఓట్లు ఉండగా.. 367 ఓట్లు పోలయ్యాయి. అందులో కాంగ్రెస్ పార్టీ మద్దతుతో పోటీ చేసిన కేతావత్ సునీతకు 182, భారత రాష్ట్ర సమితి మద్దతుతో పోటీ చేసిన బీమిలికి 182 ఓట్లు లభించాయి. ఇద్దరికీ సమానంగా ఓట్లు రావడంతో రిటర్నింగ్ అధికారి వెంకటయ్య డ్రా తీశారు. లాటరీలో కాంగ్రెస్ అభ్యర్థి సునీతను అదృష్టం వరించింది. దీంతో ఆమె సర్పంచిగా ఎన్నికైనట్టు రిటర్నింగ్ అధికారి ప్రకటించారు.

| జిల్లాలు | కాంగ్రెస్ | బీఆర్ఎస్ | భాజపా | ఇతరులు |
|---|---|---|---|---|
| ఆదిలాబాద్ (156) | 51 | 27 | 45 | 27 |
| భద్రాద్రి కొత్తగూడెం (156) | 78 | 32 | - | 43 |
| హనుమకొండ (73) | 39 | 23 | 2 | 7 |
| జగిత్యాల (144) | 99 | 15 | 12 | 14 |
| జయశంకర్ భూపాల్‌పల్లి (85) | 50 | 28 | 2 | 5 |
| జనగామ (79) | 30 | 37 | 4 | 5 |
| రాజన్న సిరిసిల్ల (88) | 38 | 28 | 5 | 17 |
| మహబూబాబాద్ (158) | 108 | 35 | - | 14 |
| మహబూబ్‌నగర్ (151) | 81 | 44 | 7 | 19 |
| మంచిర్యాల (114) | 77 | 25 | - | 4 |
| మెదక్ (149) | 55 | 44 | 15 | 30 |
| ములుగు (52) | 32 | 14 | - | 4 |
| నాగర్‌కర్నూల్ (151) | 78 | 55 | 5 | 10 |
| నల్గొండ (282) | 167 | 58 | 1 | 40 |
| నారాయణపేట (95) | 48 | 21 | 13 | 12 |
| నిర్మల్ (130) | 44 | 3 | 48 | 29 |
| నిజామాబాద్ (196) | 104 | 29 | 15 | 42 |
| పెద్దపల్లి (73) | 45 | 14 | - | 14 |
| రంగారెడ్డి (178) | 73 | 64 | 13 | 23 |
| సంగారెడ్డి (243) | 138 | 80 | 3 | 17 |
| వనపర్తి (94) | 52 | 28 | 2 | 12 |
| సిద్దిపేట (182) | 26 | 106 | 13 | 34 |
| సూర్యాపేట (181) | 104 | 39 | 2 | 26 |
| వికారాబాద్ (175) | 89 | 34 | 4 | 45 |
| జోగులాంబ గద్వాల (74) | 40 | 22 | 2 | 10 |
| కామారెడ్డి (197) | 126 | 30 | 5 | 33 |
| కరీంనగర్ (113) | 43 | 44 | 11 | 12 |
| ఖమ్మం (183) | 108 | 38 | - | 26 |
| కుమరంభీమ్ ఆసిఫాబాద్ (113) | 24 | 40 | 20 | 20 |
| వరంగల్ (117) | 70 | 40 | 2 | 4 |
| యాదాద్రి భువనగిరి (150) | 70 | 59 | 2 | 18 |
| మొత్తం (4332) | 2188 | 1156 | 253 | 616 |



## ఆస్ట్రేలియా బీచ్‌లో కాల్పులు.. 11 మంది మృతి!

**జనోదయన్యూఢెల్లి 03:**
: ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరంలో ప్రముఖ పర్యాటక ప్రదేశమైన బాండి బీచ్‌లో ఆదివారం సాయంత్రం 6.30 (స్థానిక కాలమానం ప్రకారం) గంటలకు కాల్పులు చోటు చేసుకొన్నాయి. దీనిలో కనీసం 11 మంది ప్రాణాలు కోల్పోయారు. పర్యాటకులు ఉల్లాసంగా గడుపుతున్న సమయంలో బీచ్‌లోకి ప్రవేశించిన ఇద్దరు గన్‌మెన్లు ఒక్కసారిగా ఫైరింగ్ మొదలుపెట్టడంతో వందల మంది పర్యాటకులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పరుగులు తీశారు.

..మిగతా 2లో



## ఉగ్రవాదాన్ని సహించే ప్రసక్తే లేదు:

**జనోదయ దిల్లీ డిసెంబర్ 14 :**
ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించే ప్రసక్తే లేదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా జరిగే పోరాటానికి భారత్ పూర్తి మద్దతిస్తుందని పునరుద్ఘాటించారు. ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరం బాండి బీచ్‌లో ఉగ్ర కాల్పుల ఘటనపై ప్రధాని స్పందించారు. సాధారణ పౌరుల్ని లక్ష్యంగా చేసుకొని కాల్పులు జరపడం హేయమైన చర్య అని అన్నారు. ఈ ఉగ్ర ఘటన తనను షాక్‌కు గురిచేసిందన్నారు. ఆత్మీయులను కోల్పోయిన వారికి భారత ప్రజల తరపున ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ దుఃఖ సమయంలో ఆస్ట్రేలియాకు భారత్ మద్దతుగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. మరోవైపు భారత విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ కూడా సిడ్నీ ఘటనను తీవ్రంగా ఖండించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. తమ ఆలోచలన్నీ ఆప్తులను కోల్పోయిన వారిచుట్టూనే ఉన్నాయంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు. ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరంలో ప్రముఖ పర్యాటక ప్రదేశమైన బాండి బీచ్‌లో ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో 11 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. మరో 16 మంది తీవ్రంగా గాయపడి వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు అక్కడి మీడియా వెల్లడించింది. ఇద్దరు సాయుధులైన దుండగులు విచక్షణా రహితంగా కాల్పులు జరపడంతో.. ఒక్కసారిగా అక్కడ భీతావహ పరిస్థితులు ఏర్పడ్డాయి. వందలాది మంది పర్యాటకులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పరుగులు తీశారు.



## ప్రధాని కోసం 'అఖండ2' స్పెషల్ షో.. హైందవ ధర్మం మీసం మెలేసింది: బాలకృష్ణ

**జనోదయ హైదరాబాద్ డిసెంబర్ 15 :**
సినిమా ఎప్పుడొచ్చిందని కాదు, దాని ప్రభావం సమాజంపై ఎంత ఉందన్నదే ముఖ్యమని అగ్ర కథానాయకుడు బాలకృష్ణ అన్నారు. ప్రకృతి, పిల్లల జోలికొస్తే దేవుడు ఏం చేస్తాడో 'అఖండ'లో చూపించాం. మనిషే దేవుడు అయితే ఎలా ఉంటుందో 'అఖండ2'లో చూపించామని తెలిపారు. ఆయన కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందిన చిత్రమిది. ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది. ఈ సందర్భంగా చిత్ర బృందం 'అఖండ భారత బ్లాక్‌బస్టర్' పేరుతో విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడారు.

**నన్ను చూసుకునే నాకు పొగరు..**
''అందరూ మహానుభావులు కాలేరు. ఒక పని కోసం భగవంతుడు కొంతమందిని ఎంచుకుంటాడు. ఈ సినిమా చూసి, 'సనాతన హైందవ ధర్మం మీసం

..మిగతా 2లో



## ఎలక్ట్రిక్ బస్సుల పేరుతో ఆర్టీసీని ప్రైవేటు పరం చేసే ప్రయత్నం: కవిత

**జనోదయ జగిత్యాల డిసెంబర్ 03 :**
ఎలక్ట్రిక్ బస్సుల పేరుతో ఆర్టీసీని ప్రైవేటు పరం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఆరోపించారు. ఆదివారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆమె మాట్లాడారు. ''హైదరాబాద్ మహానగరంలో కోటి మంది పైచిలుకు ప్రజలు నివాసం ఉంటున్నారు. నగరంలో 7500 వరకు ఉండే ఆర్టీసీ బస్సులను.. ఉచిత బస్సు ప్రయాణం వచ్చాక 3500కు తగ్గించారు.. దీంతో ప్రయాణించాలంటే ప్రజలకు చాలా ఇబ్బందిగా మారింది. ఎలక్ట్రిక్ బస్సుల పేరుతో ఆర్టీసీను ప్రైవేటు

..మిగతా 2లో

## రెండో విడతలో ప్రజాతీర్పు.. కాంగ్రెస్ పనితీరుకు నిదర్శనం: మహేశ్‌గౌడ్

**అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ మద్దతు-దారులే ఘన విజయం**

2



## ఆపరేషన్ సిందూర్ 2.0 అనివార్యంగా కనిపిస్తోంది: విశ్రాంత లెఫ్టినెంట్ జనరల్

**జనోదయ హైదరాబాద్,డిసెంబర్ 14:**
తుర్కియేలతో అంటకాగుతూ కశ్మీర్ అంశాన్ని పాకిస్థాన్ ఇంకా ఎగదోస్తున్న నేపథ్యంలో 'ఆపరేషన్ సిందూర్ 2.0' అనివార్యంగా కనిపిస్తోందని విశ్రాంత లెఫ్టినెంట్ జనరల్ దుశ్యంత్ సింగ్ అన్నారు. భారత సాయుధ దళాలు దీనికి సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో అమల్లోకి వచ్చిన కాల్పుల విరమణ ఇప్పటికీ అస్థిరంగా ఉందని, ఎల్‌వోసీ వెంబడి పాక్ పదే పదే ఉల్లంఘనలకు పాల్పడుతోందని మండిపడ్డారు. 'సెంటర్ ఫర్ ల్యాండ్ వార్‌ఫేర్ స్టడీస్' డీజీగానూ ఉన్న ఆయన.. గుజరాత్‌లోని వాయుసేన నైరుతి ఎయిర్ కమాండ్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈమేరకు ప్రసంగించారు.గాయాలైన బాధితులే.

మిగతా 2లో..

2



# ఆపరేషన్ సిందూర్ 2.0 అనివార్యంగా కనిపిస్తోంది: విశ్రాంత లెఫ్టినెంట్ జనరల్

మొదటి పేజ్ తరువాయి..

''ఆపరేషన్ సిందూర్ ముగింపు కాదు. యుద్ధాన్ని నిర్వహించే విషయంలో కొత్త అధ్యాయానికి నాంది. మన ప్రత్యర్థితో భవిష్యత్తులోనూ వివాదాలు తలెత్తే అవకాశం ఉంది. చైనా, తుర్కియేల మద్దతుతో కశ్మీర్ వివాదంపై పాక్ రెచ్చగొడుతూనే ఉంది. ఈ నేపథ్యంలో 'ఆపరేషన్ సిందూర్ 2.0' అనేది అనివార్యం. దాని కోసం ఎంత త్వరగా సిద్ధమైతే.. అంత మంచిది. 'ఆపరేషన్ సిందూర్' పాకిస్థాన్ బలహీనతలను బయటపెట్టింది. 1971 యుద్ధం తర్వాత మొదటిసారి మన త్రివిధ దళాలు సమన్వయంతో పనిచేశాయి. సైనికపరంగా సత్తా చాటేందుకు రాజకీయ స్పష్టత దోహదపడింది'' అని తెలిపారు.

అంతర్జాతీయ వేదికపై దేశ వ్యతిరేక ప్రచారాన్ని తిప్పికొట్టడంలో భారత్ వెనుకబడి ఉందన్నారు. ''చైనా సోషల్ మీడియా నెట్‌వర్క్‌ల మద్దతుతో పాకిస్థానీ ఇన్‌ఫ్లుయెన్సర్లు టిక్‌టాక్ వంటి ప్లాట్‌ఫామ్‌లలో రెచ్చిపోయారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత ప్రభుత్వ నెట్‌వర్క్‌లపై సైబర్ దాడులు ఏడు రెట్లు పెరిగాయి. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ దాదాపు 40 కోట్ల సైబర్ దాడులు ఎదుర్కొంది. ఒకవేళ అవి విజయవంతమైతే.. ఆర్థిక సంక్షోభానికి దారితీసేది. భారత్‌కు మెరుగైన జాతీయ భద్రతా వ్యూహం అవసరం. ఇంటెలిజెన్స్, అంతర్గత భద్రత రంగాలను సంస్కరించాలి. రక్షణ వ్యయాన్ని జీడీపీలో 3 శాతానికి పెంచాలి'' అని సూచించారు.

''వివాదాల సమయంలో సమన్వయంతో కూడిన ప్రచార వ్యవస్థ అవసరం. వ్యూహాత్మక కమ్యూనికేషన్‌లను మెరుగుపర్చాలి. ఎందుకంటే ఇవి భారత్ ఇమేజ్‌ను ప్రభావితం చేస్తాయి. భారత యుద్ధవిమానాల గురించి వైరల్ కథనాలను ఎదుర్కోవడంలో సాంకేతిక అనుసంధానం విఫలమైంది. తప్పుడు సమాచారాన్ని ట్రాక్ చేసేందుకు ఏఐని ఉపయోగించాలి'' అని దుశ్యంత్ సింగ్ పేర్కొన్నారు.



'సెంటర్ ఫర్ ఎయిర్ పవర్ స్టడీస్' (CAPS) డీజీ, విశ్రాంత ఎయిర్ వైస్ మార్షల్ అనిల్ గోలాని మాట్లాడుతూ.. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో చైనాపాక్ స్నేహం బయటపడిందని, డ్రాగన్ తన ఆయుధాలను పరీక్షించేందుకు ఈ సంఘర్షణను ఉపయోగించుకుందన్నారు.

# ప్రధాని కోసం 'అఖండ2' స్పెషల్ షో.. హైందవ ధర్మం మీసం మెలేసింది: బాలకృష్ణ

మొదటి పేజ్ తరువాయి..



మన గర్వం, మన తేజస్సు కలగలిపిన సినిమా 'అఖండ2'. ఈ మూవీలో ఒక్కో డైలాగ్ ఆణిముత్యం. ప్రతి సన్నివేశం ఒక ఉద్వేగం, ఉత్తేజ ప్రకంపనం. సినిమా ఒక నిత్యావసర వినోదం. అందుకే ఇండస్ట్రీ పెద్దలు ఎలాంటి సినిమాలు తీయాలన్న ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది. ఈ రోజు నాకు గర్వంగా ఉంది. ఇప్పటి వరకూ ఐదు సినిమాలు తీశాం. ఆరోది కూడా రాబోతోంది. చరిత్రలో చాలా మంది ఉంటారు. సృష్టించిన చరిత్రను మళ్లీ మళ్లీ తిరగరాసి తిరిగి చరిత్ర సృష్టించే వాడు ఒక్కడే. అది ఒక తెలియని శక్తి. 'ఎవరిని చూసుకుని రా బాలకృష్ణకు అంత పొగరు' అని చాలా మంది అంటారు. నన్ను చూసుకునే నాకు పదునైన పొగరు. నా వ్యక్తిత్వమే నన్ను ఉసిగొలిపే విప్లవం. నన్ను నేను తెలుసుకోవడమే నాకు తెలిసిన గొప్ప విద్య. అంతా ఆ పరమేశ్వరుడి దయ''

తెలుగు సినీ ఇండస్ట్రీకి దిష్టి తగిలింది.. ఆవేదన వ్యక్తం చేసిన తమన్

**ప్రేక్షక దేవుళ్లకు ధన్యవాదాలు..**

''సినిమా, సంగీతం ద్వారానే నాకు ఉత్సాహం కలుగుతుంది. నా వృత్తే నా దైవం. ఇది తెలుగు సినిమా మాత్రమే కాదు. ఇది ప్రపంచ సినిమా. ఎక్కడ చూసినా యుద్ధాలు, ఆకలి చావులు. మనలో మనం సృష్టించుకున్న విభేదాలు కనపడుతున్నాయి. మనం బ్యాట్‌మ్యాన్, సూపర్ మ్యాన్ గురించి మాట్లాడుకుంటాం. నాన్నగారు చేసిన పౌరాణిక సినిమాలు చూస్తాం. ఇది కూడా అలాంటి సినిమానే. మన దేశంలో ఎంతో మంది గొప్ప వ్యక్తులు ఉన్నారు. విదేశీయులు వాళ్లను తీసుకెళ్లి అభివృద్ధి చెందారు. సినిమా విజయం సాధిస్తే, అది కేవలం నా ఒక్కడి వల్లే వచ్చింది కాదు. ఎంతో మంది కృషి, శ్రమ ఉంది. ఈ సినిమా కోసం పని చేసిన ప్రతి ఒక్కరికీ, ఇంతటి విజయాన్ని అందించిన ప్రేక్షక దేవుళ్లకు ధన్యవాదాలు'' బాలకృష్ణ అన్నారు.

**ప్రధాని మోదీ కోసం స్పెషల్ షో: బోయపాటి**

దర్శకుడు బోయపాటి శ్రీను మాట్లాడుతూ.. ''భారతదేశం ధర్మానికి గ్రంథాలయం. ధర్మానికి తల్లి వేరు లాంటిది. దాన్ని నమ్మిన దేశాలు ఒకలా ఉంటే, నమ్మనవి మరోలా ఉన్నాయి. 'ఒక మనిషి అనుకుంటే, గెలవవచ్చు. ఓడవచ్చు. కానీ, దేవుడు అనుకుంటే గెలుపే ఉంటుంది ఆ విజయమే ఈ సినిమా. ఇది దేవుడి సంకల్పం. దాన్ని మీరు అద్భుతంగా ఆదరించారు. అడ్డంకులు వస్తే దేవుడే చూసుకుంటాడు. ఈ విజయానికి కారణమైన ప్రేక్షకులకు ధన్యవాదాలు. 'అఖండ2'ను 3డీలోనూ తీశాం. అదొక కొత్త అనుభూతిని ఇస్తుంది. అందరూ ప్రయత్నించండి. తమన్ చెప్పినట్లు ప్రతి ఒక్కరూ బాగుండాలి. తెలుగు సినీ పరిశ్రమ అంతా ఒక వేదికపైకి వద్దాం. బయటవాళ్లు చూసి వేరేలా అనుకునేలా చేసుకోవద్దు. త్వరలో దిల్లీలో అఖండ2 ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నాం. అఖండ2 షోను ప్రధాని మోదీ చూడబోతున్నారు'' అని అన్నారు.

# ఆస్ట్రేలియా బీచ్‌లో కాల్పులు.. 11 మంది మృతి!

**జనోదయ,దిల్లీ డిసెంబర్ 14:**

ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం నల్లటి ముసుగులు ధరించిన ఇద్దరు వ్యక్తులు షాట్‌గన్స్‌తో సర్ఫ్ క్లబ్ పక్కనే ఉన్న పాదచారుల వంతెనపైకి చేరుకొని కాల్పులు జరిపారు. అక్కడ జరుగుతున్న ఒక ఈవెంట్‌ను లక్ష్యంగా చేసుకొని దాడి చేసినట్లు అనుమానిస్తున్నారు. ఈ ఘటనలో ప్రాథమిక సమాచారం మేరకు 11 మంది మృతి చెందినట్లు ఆస్ట్రేలియా పత్రికలు పేర్కొన్నాయి. వెంటనే రంగంలోకి దిగిన భద్రతా దళాలు దుండగులను అదుపులోకి తీసుకొన్నట్లు తెలుస్తోంది. ఈ దాడిలో క్షతగాత్రులను కాపాడేందుకు హెలికాప్టర్లు, 30 అంబులెన్స్‌లు ఘటనా స్థలానికి చేరుకొన్నాయి.

**యూదుల హనుక్కా కార్యక్రమాన్ని లక్ష్యంగా చేసుకొని..**

బాండి బీచ్‌లో యూదులు జరుపుకొంటున్న హనుక్కా వేడుకలను దుండగులు లక్ష్యంగా చేసుకొన్నట్లు అనుమానిస్తున్నారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో స్థానిక యూదులు హాజరయ్యారు. ఈ ఘటనపై ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తాను ఆస్ట్రేలియా ఫెడరల్ పోలీస్ కమిషనర్, న్యూసౌత్‌వేల్స్ ప్రీమియర్‌తో మాట్లాడినట్లు వెల్లడించారు.

**కాల్పులు జరుపుతున్న దుండగుడితో పోరాడిన పౌరుడు..**

బీచ్‌లోకి చొరబడిన దుండగులు విచ్చలవిడిగా కాల్పులు జరుపుతున్న వేళ ఓ స్థానికుడు వారిని అడ్డుకున్నాడు. ఓ సాయుధుడిని వెనుక నుంచి వెళ్లి బలంగా పట్టుకొని అతడి చేతిలో గన్‌ను లాగేసుకొన్నాడు. ఆ తర్వాత చేతికందిన వాటితో అతడిని తరిమికొట్టాడు. దీంతో అతడితో ఉన్న మరో దుండగుడు కూడా వెనక్కి తగ్గాడు. ఈ వీడియో వైరల్‌గా మారింది.

దుండగుడిని గుర్తించిన భద్రతా బలగాలు బాండి బీచ్‌లో కాల్పులకు తెగబడిన ఇద్దరు దుండగుల్లో ఒకరిని సిడ్నీ భద్రతా బలగాలు గుర్తించాయి. నిందితుడు 24 ఏళ్ల నవీద్ అక్రమ్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారిస్తున్నారు. వివిధ కోణాల్లో అతడిని ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. గత కొన్నేళ్లలో పలు చోట్ల జరిగిన కాల్పులపైనా ఆరాతీస్తున్నట్లు అక్కడి మీడియా వెల్లడించింది. మరోవైపు సిడ్నీలోని అక్రమ్ ఇంట్లోనూ పోలీసులు సోదాలు నిర్వహించారు.



# రెండో విడతలో ప్రజాతీర్పు.. కాంగ్రెస్ పనితీరుకు నిదర్శనం: మహేశ్‌గౌడ్

**జనోదయ, హైదరాబాద్, డిసెంబర్ 14:**

రెండో విడత పంచాయతీ ఎన్నికల ఫలితాలు తెలంగాణ గ్రామీణ రాజకీయాల్లో స్పష్టమైన మార్పునకు సంకేతాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు.

అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ మద్దతుదారులే ఘన విజయం సాధించడం.. ప్రభుత్వ పాలనపై గ్రామీణ ప్రజలకు ఉన్న విశ్వసానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు.

''పంచాయతీ ఎన్నికలను కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, స్థానిక నాయకులను ఒకే వేదికపై సమన్వయం చేస్తూ గ్రామ స్థాయి వరకు విస్తరించిన ప్రచార వ్యూహాలే ఈ విజయానికి ప్రధాన కారణం. ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టే విధంగా వచ్చిన ఈ తీర్పు, కాంగ్రెస్ ప్రభుత్వ పాలన పట్ల గ్రామీణ ప్రజల్లో ఏర్పడిన సంతృప్తిని మరోసారి రుజువు చేసింది. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో గత రెండు సంవత్సరాలుగా అమలవుతున్న ప్రజాపాలన. సంక్షేమ అభివృద్ధి పథకాలు.. నేరుగా ప్రజలకు అందుతున్నాయి. ప్రజాసంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమన్వయంతో ఇస్తున్న పాలన ప్రజలకు నమ్మకాన్ని కలిగించింది. పంచాయతీ ఎన్నికల్లో సామాజిక న్యాయం స్పష్టంగా ప్రతిఫలించింది. ఈ విజయం పార్టీకి మరింత బాధ్యతను పెంచింది. గ్రామీణ అభివృద్ధిని మరింత వేగవంతం చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది'' అని పేర్కొన్నారు



# ఎలక్ట్రిక్ బస్సుల పేరుతో ఆర్టీసీని ప్రైవేటు పరం చేసే ప్రయత్నం



మొదటి పేజ్ తరువాయి..

ప్రైవేటు పరం చేసే ప్రయత్నం చేస్తున్నారు. రవాణా వ్యవస్థ సరిగా లేనప్పుడు హైదరాబాద్ విశ్వనగరం ఎలా అవుతుంది?అక్టోబర్ 25 నుంచి జాగృతి జనంబాట కార్యక్రమం కొనసాగుతుంది. ప్రతి జిల్లాలో రెండ్రోజులు ఉండి అక్కడి సమస్యలను తెలుసుకుంటున్నా. 15 రోజుల పాటు పంచాయతీ ఎన్నికలు ఉన్నాయి కాబట్టి ఎన్నికల కోడ్ లేని జిల్లాల్లో పర్యటించా. హైదరాబాద్‌లో వీధికుక్కలు కరవటం ప్రధాన సమస్యగా మారింది. సిటిజన్ పోలీసింగ్ ఉంటే బాగుంటుంది. పారిశుద్ధ్య కార్మికుల కొరత ఉంది.. ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోతోంది. సీతాఫల్ మండి గవర్నమెంట్ స్కూల్ దగ్గర అసాంఘిక కార్యకలాపాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. త్వరలోనే స్కూల్ నిర్మాణ పనులను పూర్తి చేయాలి. అంబర్ పేట ముసరాంబాగ్ బ్రిడ్జ్ నిర్మాణం త్వరిత గతిన పూర్తి చేయాలి. కొండపోచమ్మ సాగర్ నుంచి హైదరాబాద్‌కు తాగునీరు అందించాలి. అర్బన్‌లో కూడా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి. జనం బాటలో అనేక విషయాలు తెలిశాయి'' అని కవిత తెలిపారు.

# కత్తి పట్టుకుని నడిరోడ్డుపై యువకుడి వీరంగం.. అదుపులోకి తీసుకున్న పోలీసులు




**జనోదయ** అనంతపురం **డిసెంబర్ 14 :**

అనంతపురం జిల్లా పామిడి బస్టాండ్ ప్రాంతంలో రవి అనే యువకుడు కత్తి పట్టుకుని వీరంగం సృష్టించాడు. స్థానికులను కత్తితో బెదిరిస్తుండగా.. వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. యువకుడిని నిలువరించడానికి వెళ్లిన పోలీసులపైనా ఆ యువకుడు దాడికి యత్నించాడు. అతడి భార్య నిలువరిస్తున్నా.. కత్తి పట్టుకుని వీధుల్లో తిరుగుతూ హల్‌చల్ చేశాడు. కర్రతో పోలీసుల వాహనం అద్దాలను ధ్వంసం చేశాడు. దీంతో అక్కడి నుంచి పోలీసులు వెళ్లిపోయారు. చివరికి పోలీసులు చుట్టుముట్టి రవిని అదుపులోకి తీసుకున్నారు. మానసికస్థితి సరిగా లేకపోవడంతోనే అతడు ఇలా చేశాడని పోలీసులు తెలిపారు. రెండు రోజుల క్రితం విజయవాడ ఆస్పత్రిలో చికిత్స తీసుకొని వచ్చినట్లు వివరించారు.

# భాజపా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నితిన్ నబీన్




**జనోదయ, అమరావతి, డిసెంబర్ 14 :**

భాజపా జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా బిహార్ మంత్రి నితిన్ నబీన్ నియమితులయ్యారు. పార్టీ పార్లమెంటరీ బోర్డు ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఇది వెంటనే అమల్లోకి వస్తుందని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. బిహార్‌లోని బాంకీపుర్ అసెంబ్లీ స్థానం నుంచి నితిన్ నబీన్ వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. రహదారుల నిర్మాణశాఖ మంత్రిగా ఉన్నారు. భాజపా ప్రస్తుత జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా 2020 జనవరిలో ఈ పదవిలో నియమితులయ్యారు. ఇప్పటికే ఆయన పదవీకాలం ముగిసినప్పటికీ.. పొడిగించారు.

**ప్రధాని మోదీ శుభాకాంక్షలు**

నితిన్ నబీన్‌కు ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ''కష్టపడి పనిచేసే కార్యకర్తగా నితిన్ నబీన్ గుర్తింపు పొందారు. ఆయనకు సంస్థాగతంగా గొప్ప అనుభవం ఉంది. బిహార్‌లో ఎమ్మెల్యేగా, మంత్రిగా అద్భుతమైన రికార్డు ఆయన సొంతం. ఆయన పనితీరు రాబోయే కాలంలో భాజపాను మరింత బలోపేతం చేస్తుందని విశ్వసిస్తున్నాను'' అని ట్వీట్ చేశారు.

# మదనపల్లెలో వాజ్‌పేయీ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఉత్తరాఖండ్ సీఎం

**జనోదయ మదనపల్లె డిసెంబర్ 14 :**

ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ధామీ అన్నమయ్య జిల్లా మదనపల్లెలో పర్యటించారు. పట్టణంలో మాజీ ప్రధాని వాజ్‌పేయీ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అంతకుముందు హెలిప్యాడ్ వద్ద పుష్కర్‌సింగ్ ధామీకి ప్రజాప్రతినిధులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. ఆయనకు స్వాగతం పలికిన వారిలో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, మంత్రి సత్యకుమార్ యాదవ్, 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి, భాజపా జిల్లా అధ్యక్షుడు సాయి లోకేశ్ తదితరులు ఉన్నారు. మదనపల్లెలో నిర్వహించనున్న బహిరంగ సభలో ఉత్తరాఖండ్ సీఎం పాల్గొననున్నారు.చాయతీ సర్పంచ్ గా ఏకగ్రీవంగా ఎన్నికైన వెంకటేష్ ను పలువురు అభినందించారు.



## ఆశీర్వదించండి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా

**జనోదయ, మందమర్రి, డిసెంబర్ 14:** గ్రామపంచాయతీ ఎన్నికల్లో సారంగపల్లి సర్పంచ్ గా తనను ఆశీర్వదించి గెలిపిస్తే ఆదర్శ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దుతానని సారంగపల్లి సర్పంచ్ స్వతంత్ర అభ్యర్థి బచ్చలి రాములు అన్నారు. గ్రామంలో ఆదివారం తన మద్దతు దారులు, గ్రామస్తులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించి ఇంటింటికి తిరిగి ఓటును అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సర్పంచ్ గా తనని గెలిపిస్తే గ్రామంలో సిసి రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, మౌలిక వసతుల కల్పనతో పాటు గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. గ్రామంలో వర్షాకాలం రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు రోడ్డు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తాను గెలిచిన వెంటనే ప్రథమ ప్రాధాన్యంగా గ్రామ రైతుల సౌకర్యార్థం రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. గ్రామ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ నిస్వార్థంగా సేవ చేస్తామని, ఎన్నికల్లో తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఆయన వెంట ప్రచారంలో ఫిరోజ్, బచ్చలి ప్రవీణ్, గ్రామస్తులు, మద్దతు దారులు పాల్గొన్నారు.

# బెల్లంపల్లిలో ప్రశాంతంగా పోలింగ్

**జనోదయ, బెల్లంపల్లి, డిసెంబర్ 14: :** బెల్లంపల్లి మండలంలో ఆదివారం రెండవ విడత పంచాయితీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 7 గంటల నుండి ఓటర్లు పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేసేందుకు ఉత్సాహం చూపారు. మండలంలో మొత్తం 23464 మంది ఓటర్లలో 11625 మంది పురుషులు, 11838 మంది మహిళలు ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉండగా ఉదయం 9 గంటల వరకు 5353 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోవడంతో 22.8 శాతం పోలింగ్ నమోదైంది. పెరిక పల్లి గ్రామపంచాయతీలో 471 ఓట్లు పోలై 34.5 శాతం పోలింగ్ జరిగింది.ఉదయం 11 గంటల వరకు 9,440 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ ముగిసే సమయానికి 9975 మంది పురుషులు, 10040 మంది మహిళలు ఓటు హక్కును వినియోగించుకోవడంతో 85.3 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. పోలింగ్ సరళిని పరిశీలిస్తే పురుషుల కంటే మహిళలే అత్యధికంగా ఓటింగ్ లో పాల్గొనడం విశేషం. అత్యధికంగా లింగాపూర్ గ్రామపంచాయతీలో 94.6 శాతం, బుచ్చయ్యపల్లి పంచాయతీలో 92.6 శాతం, బట్వాన్ పల్లి పంచాయతీలో 91.2 శాతం, పెరిక పల్లి పంచాయతీలో 90.8 శాతం,అకెనపల్లి పంచాయితీలో 90.5 శాతం పోలింగ్ నమోదైంది. బుధాకలన్, బుధకుర్దు, చాకేపల్లి, చంద్రవెల్లి, దుగ్నేపల్లి, గురిజాల, కన్నాల, లంబాడి తండ, మాల గురిజాల, పాత బెల్లంపల్లి పంచాయతీల్లో 80 శాతానికి పైగా పోలింగ్ నమోదు కాగా సోమ గూడెం పంచాయితీలో 74.5 శాతం పోలింగ్ జరిగింది.



ఓటు వేసేందుకు ఉత్సాహం చూపిన మహిళలు, వృద్ధులు

## పులిమడుగులో భూక్యా బుజ్జి ప్రచారం

**జనోదయ, మందమర్రి డిసెంబర్ 14::** పులిమడుగు గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి భూక్యా బుజ్జి తన ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరంగా చేపట్టారు. ఆదివారం గ్రామంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు, మద్దతుదారులతో కలిసి ఇంటింటికి తిరిగి తనను ఆదరించి గెలిపించాలని ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా మద్దతు దారులు డప్పు చప్పుళ్లతో సంప్రదాయ నృత్యాలు చేస్తూ టపాసులు పేల్చి ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని అన్నారు. తనను ఆదరించి అత్యధిక మెజారిటీతో గెలిపిస్తే గ్రామాన్ని అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి చేసి, ఆదర్శ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దు తానని స్పష్టం చేశారు. ఈనెల 17న జరగనున్న ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు



## నెన్నల లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

**జనోదయ, బెల్లంపల్లి, డిసెంబర్ 14:** బెల్లంపల్లి నియోజకవర్గంలోని నెన్నల్ మండలంలో ఆదివారం జరిగిన రెండవ విడత పంచాయతీ ఎన్నికల ప్రక్రియను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పరిశీలించారు. మండలంలోని మైలారం, చిత్తాపూర్, గుండ్ల సోమవారం గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పకడ్బందీగా పంచాయతీ ఎన్నికల ను నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఎన్నికల విధుల్లో సూక్ష్మ పరిశీలకులు, ఫ్లయింగ్ స్క్వాడ్, మండల పరిషత్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, పోలింగ్, పోలీస్ సిబ్బంది సమర్థవంతంగా విధులను నిర్వర్తించారని తెలిపారు. 1,37,382 మంది ఓటర్లకు గాను 1, 8808 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారని, ఫలితంగా 79.2 శాతం ఓటింగ్ జరిగిందని తెలిపారు. జిల్లాలో ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించినట్లు చెప్పారు. మూడవ విడత ఎన్నికలను అధికారులు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా కృషి చేయాలని కోరారు. అదేవిధంగా నియోజకవర్గంలోని వేమనపల్లి మండలంలో జరుగుతున్న ఎన్నికల తీరును జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వరరావు పరిశీలించారు.



## భీమారం గ్రామాభివృద్ధే నా ఎజెండా – సర్పంచ్ అలకాటి భాగ్యలక్ష్మి తిరుపతి.


**జనోదయ భీమారం డిసెంబర్ 14**

మంచిర్యాల జిల్లా భీమారం గ్రామ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే తన ప్రధాన సంకల్పమని భీమారం కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి అలాకాటి భాగ్యలక్ష్మి తిరుపతి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం గ్రామంలోని పలు కాలనీలలో ప్రజలతో నేరుగా మమేకమై ఆమె సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో ప్రాథమిక వసతుల లోపాలను తొలగించడమే తన తొలి ప్రాధాన్యమని తెలిపారు. తాగునీటి సరఫరా మెరుగుదల, పరిశుభ్రత కార్యక్రమాల బలోపేతం, వీధిదీపాల ఏర్పాటు, మురుగు నీటి కాలువల అభివృద్ధి, సీసీ రోడ్ల నిర్మాణం వంటి అంశాల్లో కార్యాచరణ రూపొందిస్తానన్నారు. గ్రామ అభివృద్ధి కాంగ్రెస్ అభ్యర్థితోనే సాధ్యమని కావున తనను గెలిపించాలని ప్రజలను కోరారు. బ్యాటు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో తనను సర్పంచ్ గా గెలిపించాలని ప్రజలను కోరారు ఈ కార్యక్రమంలో మండల నాయకులు, అన్ని కుల సంఘాల నాయకులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు. అందుగులపేటలో సిపిఐ నాయకుల ముమ్మర ప్రచారం.

# కన్నాలలో ఓటు చోరీ పై కలకలం..!

**జనోదయ, బెల్లంపల్లి, డిసెంబర్ 14:**

బెల్లంపల్లి మండలంలోని కన్నాల గ్రామపంచాయతీ పరిధిలో గల ఎస్సీ కాలనీ లోని 6 వ నెంబర్ పోలింగ్ కేంద్రంలో ధర్మాజీ రేఖ అనే ఓటరు స్థానంలో మరొకరు ఓటు వేయడం స్థానికంగా కలకలం రేపింది. కన్నాల ఎస్సీ కాలనీలో ఉండే ధర్మాజీ రేఖ, తన కుమారుడు శ్రీకాంత్ తో కలసి క్యాతన పల్లి లో ఉంటున్నారు. ఓటేసేందుకు ఆదివారం తమ గ్రామానికి వచ్చారు. ఓటు వేద్దామని పోలింగ్ కేంద్రానికి వెళ్లేసరికి అంతకుముందే 0502 ఆధార్ కార్డ్ నెంబర్ తో ధర్మాజీ రేఖ ఓటు మరొకరు వేశారు. తన కు సంబంధం లేకుండా తన ఓటు చోరీకి గురైందని, తనకు ఓటు వేసే అవకాశం కల్పించాలని పోలింగ్ కేంద్రంలో అధికారుల ను కోరినప్పటికీ వారు అంగీకరించలేదు. దీంతో చేసేది ఏమీ లేక ఓటరు ధర్మాజీ రేఖ ఓటు వేయకుండానే నిరుత్సాహం తో అధికారుల తీరు పై అసహనం వ్యక్తం చేసింది. ఎస్సీ కాలనీ పోలింగ్ కేంద్రంలో ఓటు చోరీ జరగడం పట్ల అభ్యర్థుల మద్దతుదారులు ఆందోళన చెందారు.



రసీదు
మండల్ పేరు : బెల్లంపల్లి
గ్రా. పం. పేరు : కన్నాల వార్డు : 6
వరుస సంఖ్య : 12
పేరు : ధర్మాజీ రేఖ
ఓటరు సంతకం/ కుటుంబ సభ్యుల సంతకం

ఓటర్ స్లిప్
గ్రామ పంచాయితీ సాధారణ ఎన్నికలు, 2025
మండల్ పేరు : బెల్లంపల్లి
గ్రా. పం. పేరు: కన్నాల వార్డు - 6
పోలింగ్ కేంద్రం : కన్నాల
వరుస సంఖ్య : 12
ఓటరు పేరు : ధర్మాజీ రేఖ
భర్త పేరు : లింగయ్య
వయస్సు : 48 లింగము : స్త్రీ
ఇంటి నెంబర్ : 2-36
ఎపిక్ నెంబర్ : TVN0167278
తేదీ & సమయం : 14-12-2025(7 AM to 1 PM)

## నూతన క్రికెట్ అకాడమీని ప్రారంభించిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

**జనోదయ తెల్లాపూర్ డిసెంబర్ 14:** సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ డివిజన్ పరిధిలో మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన వన్ ఛాంపియన్ క్రికెట్ అకాడమీనీ ఆదివారం పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న తెల్లాపూర్ పరిధిలో క్రీడలకు సంబంధించిన అకాడమీలు ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు.. విద్యార్థి దశ నుండి క్రీడలవై ఆసక్తి పెంపొందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సోమిరెడ్డి, మల్లారెడ్డి, నాగరాజు, బాబ్జీ, కొమరయ్య, శ్రీనివాస్ రెడ్డి, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



## అందుగులపేటలో సిపిఐ నాయకుల ముమ్మర ప్రచారం

**జనోదయ, మందమర్రి డిసెంబర్ 14:**

గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా మండలంలోని అందుగులపేట గ్రామ పంచాయతీలో సిపిఐ బలపరిచిన అభ్యర్థి రొడ్డ తిరుమల నరేష్ తన ఎన్నికల ప్రచారం ముమ్మరం చేశారు. ఆదివారం గ్రామంలో సిపిఐ రాష్ట్ర, జిల్లా, ఏఐటియుసి నాయకులు, తన మద్దతు దారులతో కలసి గ్రామంలో బారి ర్యాలీ నిర్వహించి ఇంటింటికి తిరిగి ఓటర్లను కలిసి ఓటు అభ్యర్థించారు.

ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్, సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ లు మాట్లాడారు. అందుగులపేట గ్రామ సమగ్ర అభివృద్ధి, నిరుపేదల లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు నిష్పక్షపాతంగా అందాలంటే సిపిఐ అభ్యర్థి గెలుపు ద్వారానే సాధ్యమవు తుందన్నారు. సిపిఐ బలపరిచిన అభ్యర్థి రొడ్డ తిరుమల నరేష్ ను అత్యధిక మెజారిటీతో గెలిపించి గ్రామ అభివృద్ధికి పాటుపడాలన్నారు. గ్రామ ప్రజలకు విశ్వార్థంగా సేవ చేసేందుకు ముందుకు వచ్చిన తిరుమలను ఆదరించి ఆశీర్వదించాలన్నారు. సిపిఐ బలపరిచిన సర్పంచ్ లు గెలిచి ఆదర్శ గ్రామాలుగా తీర్చి దిద్దారని, అందుగులపేటను ఆదర్శ గ్రామంగా తీర్చి ఇదే ఎందుకు సిపిఐ అభ్యర్థి తిరుమలను గెలిపించాలని కోరారు. అనంతరం సర్పంచ్ అభ్యర్థి రొడ్డ



తిరుమల నరేష్ మాట్లాడుతూ తనను ఆదరించి గెలిపిస్తే గ్రామ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని అన్నారు. గ్రామస్తులకు ఇబ్బందికరంగా మారిన పెద్ద వాగుపై వంతెన నిర్మాణానికి కృషి చేయడంతో పాటు గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యతనిస్తానన్నారు.

అందరికీ అందుబాటులో ఉంటూ నిరంతరం ప్రజా సేవ చేస్తానని స్పష్టం చేశారు.

గ్రామస్తులందరూ ఈ నెల 17న జరగనున్న ఎన్నికల్లో తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ గ్రామఎన్నికల కన్వీనర్ వనం సత్యనారాయణ, పట్టణ కార్యదర్శి కామెర దుర్గారాజ్, సిపిఐ పట్టణ నాయకులు ఆంథోని, దినేష్, బండారి రాజేష్, జెట్టి మల్లయ్య, గడ్డం సంతోష్, గ్రామ కార్యదర్శి తాళ్లపల్లి వీరయ్య, తాళ్లపల్లి విష్ణు, మేకల రాజేశం, గ్రామస్థులు మద్దతుదారులు పాల్గొన్నారు.

## కాసిపేట లంబడి తండా (కె) పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు వస్తున్న ఓటర్లు



**జనోదయ, బెల్లంపల్లి, డిసెంబర్ 14: బెల్లంపల్లి నియోజకవర్గంలో 84.59 శాతం పోలింగ్**

రెండవ విడత పంచాయితీ ఎన్నికల్లో భాగంగా ఆదివారం బెల్లంపల్లి నియోజకవర్గంలో 84.59 శాతం పోలింగ్ జరిగింది. బెల్లంపల్లి మండలంలో 20015 మంది ఓటు హక్కు వినియోగించుకోవడంతో 85.30 శాతం, భీమిని మండలంలో 10364 ఓట్లతో 89.90 శాతం, కన్నెపల్లి మండలంలో 13357 ఓట్లతో 90.37 శాతం, కాసిపేట మండలంలో 19998 ఓట్లతో 78.74 శాతం, నెన్నల్ మండలంలో 17255 ఓట్లతో 89.08 శాతం, తాండూర్ మండలంలో 21794 ఓట్లతో 78.52 శాతం, వేమనపల్లిలో 13422 ఓట్లతో 89.0 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తంగా 58179 మంది పురుషులు, 58023 మంది మహిళలు, ఇతరులు 3 కలుపుకొని 116205 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

# నెన్నల్ లో పోలింగ్ కేంద్రాన్ని సందర్శిస్తున్న సి.పి అంబర్ కిషోర్ ఝా

**జనోదయ, బెల్లంపల్లి, డిసెంబర్ 14:**

బెల్లంపల్లి పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో ఆదివారం జరుగుతున్న రెండో విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ ను రామగుండం సిపి అంబర్ కిషోర్ ఝా పరిశీలించారు. బెల్లంపల్లి మండలంలోని తాళ్ల గురిజాల, నెన్నల్ మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల కౌంటింగ్, ఫలితాల వెల్లడి పూర్తయి వరకు పోలీసులు అప్రమత్తతో విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. సీపీ వెంట మంచిర్యాల డిసిపి ఎక్కడి భాస్కర్, మంచిర్యాల ఏసిపి ప్రకాష్,నెన్నల్ ఎస్సై ప్రసాద్ లు ఉన్నారు. బెల్లంపల్లి మండలంలో పలు పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసుల బందోబస్తును మంచిర్యాల డిసిపి భాస్కర్ పర్యవేక్షించారు.



# పొరండ్ల సర్పంచ్‌గా నక్క హరీష్ ఘన విజయం



**జనోదయ, జగిత్యాల ప్రతినిధి, డిసెంబర్ 14:**

జగిత్యాల జిల్లా జగిత్యాల మండలంలోని పొరండ్ల గ్రామంలో సర్పంచ్ ఎన్నికలు ఆసక్తికరంగా సాగగా, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ బలపరచిన నక్క హరీష్ ఘన విజయం సాధించారు. ప్రజలతో నిత్యం మమేకమై ఉండే హరీష్‌కు గ్రామస్థులు సంపూర్ణ మద్దతు ప్రకటించడంతో, ఆయన ప్రత్యర్థులపై భారీ మెజారిటీతో గెలుపొందారు. నక్క హరీష్ గత కొంతకాలంగా గ్రామాభివృద్ధికి కృషి చేస్తూ, యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తూ. ఎన్నికల ప్రచారం సందర్భంగా గ్రామంలో తాగునీటి సమస్యలు, రహదారి అభివృద్ధి, రైతుల సమస్యలు, డెవలప్‌మెంట్ పనులను ఆయన ప్రధాన అజెండాగా ప్రజల ముందుంచారు. గెలుపు అనంతరం హరీష్ మాట్లాడుతూ – “ఈ గెలుపు నా వ్యక్తిగత విజయమేకాదు, ఇది పొరండ్ల గ్రామ ప్రజల ఆశయాల గెలుపు. మీరు చూపిన విశ్వాసాన్ని న్యాయంగా నిలబెట్టుకుంటా. గ్రామ అభివృద్ధికి నడుం బిగిస్తా” అన్నారు. హరీష్ గెలుపుతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. పెద్దలు, మహిళలు, యువత భారీగా పాల్గొని అతనికి శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ స్థానిక నాయకులు, కార్యకర్తలు ఈ విజయాన్ని పార్టీకి కలిసొచ్చే సంకేతంగా భావిస్తున్నారు. పొరండ్లను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు నక్క హరీష్ ముందడుగు వేయనున్నారు. ప్రజల ఆశలు, అభీష్టాలు నెరవేర్చే నాయకుడిగా ఆయన కొనసాగుతారని స్థానికులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

# ఆధరించి గెలిపించండి నిస్వార్ధంగా సేవ చేస్తా

**--ఆదిల్ పేట బిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి గుర్రం శ్రీనివాస్ గౌడ్**

**జనోదయ, మందమర్రి, డిసెంబర్ 14:**

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆదిల్ పేట సర్పంచ్ గా తనను ఆదరించి గెలిపించాలని గ్రామ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ నిస్వార్థంగా సేవ చేస్తానని ఆదిల్ పేట బిఆర్ఎస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి గుర్రం శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం అదిల్ పేట గ్రామంలో ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలిసి ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో సిసి రోడ్లు, డ్రైనేజీలు, వీధిలైట్లు, ఇంటింటికి మంచి నీటి సౌకర్యంతో పాటు గ్రామంలో మౌళిక వసతులు కల్పిస్తానని అన్నారు. వృద్ధులకు పింఛన్లు, ప్రభుత్వం సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందించేందుకు కృషి చేస్తానన్నారు. గ్రామం లోని మహిళలు, యువకులు, అన్ని కుల సంఘాల పెద్దల సహకారంతో సర్పంచ్ గా గెలిపిస్తే గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయం నిర్మాణానికి తన సొంత స్థలం కేటాయిస్తానని, గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా నని స్పష్టం చేశారు. ఈ నెల 17న జరగనున్న ఎన్నికల్లో తనను ఆదరించి అత్యధిక మెజారిటీ తో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు కొట్రంగి తిరుపతి, మండల బిఆర్ఎస్ పబ్లిసిటీ ఇన్చార్జి తైదల జంపన్న, మాజీ సర్పంచ్ సోదరి పున్నం, గ్రామస్థులు, మద్దతుదారులు పాల్గొన్నారు.




# రేచపల్లి సర్పంచ్‌గా ప్రజా సేవలో పాత్రికేయుడు బాస మహేష్ విజయం

**జనోదయ, జగిత్యాల ప్రతినిధి, డిసెంబర్ 14:**

జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలంలోని రేచపల్లి గ్రామంలో సర్పంచ్ పదవికి జరిగిన ఎన్నికల్లో స్థానిక పాత్రికేయుడు బాస మహేష్ ఘన విజయం సాధించారు. ప్రజల సమస్యలను వెలుగులోకి తేవడమే కాకుండా, వాటికి పరిష్కారం చూపే నాయకుడిగా నిలవాలనే ఉద్దేశంతో రాజకీయ రంగ ప్రవేశం చేసిన ఆయన, పెద్ద మెజారిటీతో గెలుపొందడం ప్రత్యేక ఆకర్షణగా మారింది.

బాస మహేష్ పాత్రికేయునిగా ఎన్నో సంవత్సరాలుగా గ్రామ ప్రజల ముప్పుతిప్పులను పత్రికల ద్వారా వెలుగులోకి తేవడమే కాకుండా, సమస్యలపై అధికారులను ప్రశ్నిస్తూ ప్రజలతో మమేకమై పనిచేశారు. తన పని శైలిలోనే, ఎన్నికల ప్రచారంలో కూడా ప్రతి ఇంటి తలుపు తట్టి ప్రజల సమస్యలు వినిపించుకుంటూ, వాటి పరిష్కారానికి తన ప్రణాళికలను వివరించారు.


విజయం అనంతరం బాస మహేష్ మాట్లాడుతూ – “ఇప్పటివరకు మీ గొంతుగా కలం నడిపాను, ఇకమీదట మీ సమస్యల పరిష్కారానికి కార్యరూపం దాల్చే ప్రజా సేవగానే పనిచేస్తా. రేచపల్లిని అభివృద్ధిలో మోడల్ గ్రామంగా తీర్చిదిద్దడం నా లక్ష్యం” అని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు ఆయన గెలుపును జరుపుకుంటూ, బాస మహేష్‌కి ఘన స్వాగతం పలికారు. యువత, మహిళలు, రైతులు పెద్దఎత్తున పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఇక నుంచి బాస మహేష్ నాయకత్వంలో రేచపల్లి అభివృద్ధి బాటలో నడవనుందని గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



# రాష్ట్రంలో మరో ఘోర ప్రమాదం..ఒకరు మృతి, 5 గురికి !

**జనోదయ,మధిర, డిసెంబర్ 14 :**

ట్రాక్టర్, టాటా ఏసీ ఢీకొన్న సంఘటనలో ఒక బాలిక మృతి చెందగా ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఏపీ కంచకచర్ల మండలం చెవిటికల్లు గ్రామానికి చెందిన వారు ఆదివారం రాత్రి ఏపీ గంపలగూడెం మండలం ఊటుకూరు గ్రామంలో బారసాల కార్యక్రమానికి వెళ్లి, తిరిగి వస్తున్న క్రమంలో ఈ సంఘటన జరిగింది. సరిగ్గా మధిర మండలం ఖాజీపురం గ్రామ సమీపంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ రోడ్డు ప్రమాదంలో అయేషా ( 17 ) అనే బాలిక మృతి చెందగా ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను వైద్య సేవల నిమిత్తం మధిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.




# సింగరేణిని నిర్వీర్యం చేస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు



**జనోదయ, మందమర్రి డిసెంబర్ 14:**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నడుస్తున్న సింగరేణి సంస్థను అభివృద్ధి చేయడం మాని పరోక్షంగా సంస్థ నిర్వీర్యానికి సహకరిస్తు న్నాయని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులు సాంబారు వెంకటస్వామి, అల్లి రాజేందర్ లు విమర్శించారు. రామకృష్ణాపూర్ పట్టణంలోని యూనియన్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సింగరేణి సంస్థ సాధించిన లాభాలలో నుండి కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు 51:49 శాతం డివిడెండ్లు తీసుకోవడమే తప్ప సంస్థను ఆర్థికంగా అభివృద్ధి చేయడంలో, సంస్థకు రావాల్సిన బకాయలు ఇప్పించడంలో, నూతన గనులను కేటాయించి సంస్థ భవిష్యత్తును పెంచడం లో గా సహకరించడం లేదని మండి పడ్డారు. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం సంస్థ నిధులను దుబారాగా వాడుకుంటూ, సింగరేణి కార్మికుల సొంతింటి కళను నెరవేర్చడం లేదని విరుచుకు పడ్డారు. కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ బొగ్గును ఎక్కువ ధరకు కొనుగోలు చేయాలని చెప్తూ సింగరేణికి మాత్రం బొగ్గు ధరలు తగ్గించుకోమని, నాణ్యమైన బొగ్గును ఉత్పత్తిచేయాలంటూ ఉచిత సలహాలు ఇవ్వడం దుర్మార్గమన్నారు. రాష్ట్రం నుండి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి ఉన్న సింగరేణికి అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సంస్థ లో సెక్యూరిటీ, క్లరికల్ సిబ్బంది సరిపడ లేనప్పటికీ యాజమా న్యం పంచాయతీ ఎన్నికలకు సిబ్బందిని పంపడం వలన వారు ఆర్థికంగా నష్టపోతున్నా రని దీనిని సరి చేసి ఉద్యోగులకు ఓడి మస్టర్ ఇచ్చేలా సింగరేణి సంస్థకు ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ ఎలక్షన్ కమిషనర్ కు లేఖ రాశామని వారు గుర్తు చేశారు. కార్మికుల సమస్యలపరిష్కార మార్గాలపై తమ యూనియన్ కల్పిస్తున్న అవగాహనతో కార్మికులలో వస్తున్న ఆదరణను చూసి తట్టుకో లేక హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ తన స్థాయిని మరిచి కాంట్రాక్టు, పర్మినెంట్ కార్మిక సంఘం కు తేడా తెలియ కుండా, పిచ్చిపిచ్చిగా మాట్లాడుతూ విమర్శించడం మానుకోవాలని వారు హితవు పలికారు. ఇతర యూనియన్ లపై తప్పుడు ఆరోపణలు చేసి చర్చలకు రాకుండా తోక ముడవడం ఆయనకు పరిపాటేనన్నారు. గతంలో జరిగిన ఎన్నికల్లో కార్యకర్తలకు ముఖం చాటేసి నమ్ముకున్న కార్యకర్తలను నట్టేట ముంచిన చరిత్ర రియాజ్ అహ్మద్ కే దక్కుతుందన్నారు. సిద్ధాంత పరంగా సిఐటియు ఎటువంటి చర్చలకైనా సిద్ధంగా ఉంటుందని వారు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఇది యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షులు రామగిరి రామస్వామి, నాయకులు జోరుక.వెంకటేష్, జడల ప్రవీణ్, పసునూటి శ్రీకాంత్, నాగవల్లి శ్రీధర్, నామని సురేష్, సయ్యద్ అమీర్, కలువల శ్రీనివాస్, బాసబోయిన కుమారస్వామి, తాజుద్దీన్, రవికాంత్, శరణ్ లు పాల్గొన్నారు.

# మదనపల్లెలో వాజ్‌పేయిూ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఉత్తరాఖండ్ సీఎం



**జనోదయ, మదనపల్లె డిసెంబర్ 14:**

మానవ హక్కులపై ప్రజల్లో అవగాహన కల్పిం ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ధామీ అన్నమయ్య జిల్లా మదనపల్లెలో పర్యటించారు. పట్టణంలో మాజీ ప్రధాని వాజ్‌పేయిూ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అంతకుముందు హెలిప్యాడ్ వద్ద పుష్కర్‌సింగ్ ధామీకి ప్రజాప్రతినిధులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. ఆయనకు స్వాగతం పలికిన వారిలో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, మంత్రి సత్యకుమార్ యాదవ్, 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి, భాజపా జిల్లా అధ్యక్షుడు సాయి లోకేశ్ తదితరులు ఉన్నారు. మదనపల్లెలో నిర్వహించనున్న బహిరంగ సభలో ఉత్తరాఖండ్ సీఎం పాల్గొననున్నారు.

# ఓటమి చెందిన ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న సర్పంచ్ అభ్యర్థి

**జనోదయ ,కథలాపూర్ , డిసెంబర్ 14:**

ప్రతి ఆటలో గెలుపోటములు సహజం. కానీ తాను ఓడినా ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాడు ఓ సర్పంచ్ అభ్యర్థి. జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం ఇప్పపెల్లి గ్రామానికి చెందిన సర్పంచ్ అభ్యర్థి యాగండ్ల రమేష్ గౌడ్ మాట తప్పను మడమ తిప్పను అన్నట్లు గ్రామంలోని ఈత వనానికి నీటి సౌకర్యం నిమిత్తం ఎల్లమ్మ గుడి సమీపంలో బోరును ఏపిచ్చి తన ఉదరాతను చాటుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు యాగండ్ల రమేష్ సేవా భావానికి అభినందనలు తెలిపారు.



# బెల్లంపల్లిలో విజేతలు వీరే..!



















**జనోదయ, బెల్లంపల్లి, డిసెంబర్ 14:**
బెల్లంపల్లి మండలంలో ఆదివారం జరిగిన రెండవ విడత పంచాయతీ ఎన్నికల్లో 17 గ్రామపంచాయతీలో సర్పంచ్ స్థానాలకు గెలుపొందిన విజేతల వివరాలు ఇలా ఉన్నాయి. నాతరి మల్లమ్మ (కన్నాల), చిలుముల శ్రీనివాస్(చంద్రవెల్లి), సాగర్ల లక్ష్మణ్ (లంబడి తండా), సుధమల్ల వెంకటి (అకెనపల్లి), జాడి మహేష్ (బుచ్చయ్యపల్లి), సింగతి రాజేష్ (బట్వాన్పల్లి), జుమ్మిడి లలిత (దుగ్నే పల్లి), బొంతల అరుణ (అంకుశం), పొన్నాల మౌనిక (సోమ గూడెం), తొంగల నర్మద (లింగాపూర్), పెద్ద బోయిన శ్యామలత (మాల గురిజాల), వంగ రామన్న (తాళ్ల గురిజాల), జంబి మౌనిక(చాకేపల్లి), వెంబడి రాణి (బుధ కుర్దు), జర్పుల సాయికుమార్ (పెరిక పల్లి), దాడి నగేష్ (బుధాకలన్), పెట్టం లక్ష్మి (పాత బెల్లంపల్లి)లు ఎన్నికయ్యారు.




# కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

## నూతనంగా గెలిచిన సర్పంచులను అభినందించిన ఎమ్మెల్యే

**జనోదయ,గంగాధర,(చొప్పదండిఆర్‌సి) డిసెంబర్ 14:**
కాంగ్రెస్ పార్టీతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. చొప్పదండి నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో ఇటీవల నూతనంగా గెలుపొందిన సర్పంచులు శనివారం గంగాధరలోని ఆయన ప్రజా కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నూతన సర్పంచులను శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ఆయా గ్రామాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని తగిన నిధులు కేటాయించి పూర్తి స్థాయిలో సహకరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే గ్రామాల ముఖచిత్రం మారుతుందన్నారు.

**కాంగ్రెస్ పార్టీలో చేరికలు:**
చొప్పదండి నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు సంబంధించిన నూతన సర్పంచులు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గంగాధరలోని ప్రజాకార్యాలయంలోనిర్వహించినకార్యక్రమంలో ఎమ్మెల్యే నూతనంగా చేరిన సర్పంచులకు కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, అన్ని గ్రామాలకు సమానంగా నిధులు కేటాయించి మౌలిక సదుపాయాల కల్పనకు సహకరిస్తామని భరోసా ఇచ్చారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.




## కోడిమ్యాల్ మండలంలో రెండో విడత సర్పంచ్ ఎన్నికలు: భారీగా పోలింగ్

**జనోదయ,కోడిమ్యాల్,(చొప్పదండిఆర్‌సి) డిసెంబర్ 14: :**
జగిత్యాల జిల్లా కోడిమ్యాల్ మండలంలో సర్పంచ్ ఎన్నికలు రెండో విడత కింద శాంతియుతంగా నిర్వహించబడ్డాయి. కోడిమ్యాల్ గ్రామ పంచాయతీలో ఉదయం నుంచే ఓటర్లు పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మహిళలు, వృద్ధులు సైతం ఉత్సాహంగా పాల్గొని అధికంగా పోలింగ్ నమోదు కావడం గమనార్హం.

అలాగే మండలంలోని మల్యాల గ్రామంలో కూడా ఉదయం నుంచే ఓటర్ల రద్దీ కనిపించింది. ప్రజలు క్రమబద్ధంగా క్యూల్లో నిలబడి ఓటు వేసి ప్రజాస్వామ్య పండుగలో భాగమయ్యారు. ఎన్నికలు ప్రశాంతంగా సాగేందుకు ఎన్నికల అధికారులు తగిన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.

ఎవరికి సర్పంచ్ పీఠం దక్కుతుందో అన్న ఉత్కంఠ నెలకొని ఉండగా, ఫలితాల కోసం ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. చేసినారు.






## జీవన స్వరాలు

నాటి రాజులు మేటి రాజులు
నేటి నేతలు మేధ యోధులు
ప్రజల బాధలు రాజు బాధలు
జనత గోసలు నేత చేరవు

పేరు గొప్పది పేరు మారెను
లోహరథాల పొగల రోతలు
తిండి కల్తీ గుండె జబ్బులు
మత్తు నగరం మనీ ముఖ్యం

బోడి ఊహలు కోడి ఈకలు

ప్రశ్న లోయలు శూన్య దారులు
కాళ్ల బొబ్బలు కడుపు మంటలు
తిరుగు బాటే జరుగు బాటూ
మబ్బుల వెనుక వెన్నల తునక
మాటల వెనుక మంటల వేడి
ఆశల తోట అందరి బాట
ముష్టి బిగించు ముందుకు నడువు

కలసి కట్టుగ కదను త్రొక్కిన
కొత్తలోకపు తలుపు తట్టిన
మట్టి మనుషుల మనో వేదుక

## మీఠాపాన్ దోస్తానా !!



పండగ భోజనం కాగానే పాన్ దాన్ ఆహ్వాని
స్తుంది
ఆయాసం మరిచేలా నోటిలో తాంబూలం
రాజ్యం !
నమిలినా కొద్దీ మిఠాపాన్ నాల్క పై చెలిమె
చెలిమె !
ఎరుపు రంగుతో నాల్కకు మేకప్ చేస్తుంది
మీఠాపాన్

కోపిష్టి సైతం తియ్యటి తాంబూలం నమిలితే
మధురం కోపాన్ని మటు మాయం చేస్తుంది !
ఆలు మగల అలకలు అటకెక్కిపోతాయి
మీఠాపాన్ ఇంద్రజాలం !

ఇచ్చిన పాన్ నమిలినాకా దుష్మన్ బీ దోస్త్ !
మీఠాపాన్ మాయలో పడితే మాటలే మాటలు
అలుగు వారినట్లు ఆశువుగా పద్య పఠనం
"వహ్వా" పదాల ముషాయిరా !

మీఠాపాన్ లు కట్టించే
చిన్న పాన్ కోకా సైతం అంగడంగడే
దసరా రంజాన్ పండగ లెక్క సందడి

అందరూ మీఠాపాన్ అభిమానులే
కులం లేదు మతం లేదు ప్రాంతం లేదు !
అందరి నోట మీఠాపాన్ షోకు

-- కందాళై రాఘ-

## రచనలకు ఆహ్వానం

నిత్య నూతనంగా వెలువడుతూ ఆశేష పాఠకాదరణ పొందుతున్న 'జనోదయ' తెలుగు దినపత్రికకు సమకాలీన రాజకీయ, సామాజిక, ఆర్థిక, విద్య,వైద్యం, స్పోర్ట్స్, వ్యవసాయం, శాస్త్రసాంకేతికం, సాహిత్యం, కథలు, నవలలు, వినోదం ..ఇలా అనేక అంశాల మీద వ్యాసాలు, రచనలకు ఆహ్వానం. మీ రచనలను కంపోజ్ చేసి కింది వాట్సాప్ నంబర్‌కు పంపాలి.

ఎడిటర్
జనోదయ
తెలుగు దినపత్రిక
8074124190

# యుద్ధం...ప్రణయం మధ్య ప్రేమకథ




**ప్రణయహంపీ**
మారుతి పౌరోహితం
నవల
పేజీలు: 132, వెల: రూ.150
ఛాయ ప్రచురణ

యుద్ధం ఒక భయానక దృశ్యం... అది ఎప్పుడో చేసుకుంది మనిషిని తనకు దాస్యం.. అది మనిషికి అయిపోతోంది తీరని దాహం.. మనిషిలో స్వార్థం అలలు అలలా ఎగిసిపడే కొద్దీ ఇప్పుడు నిత్యజీవితంలో ఒక భాగమైపోయింది యుద్ధవ్యామోహం. శతాబ్దాలనాటి మహారాజులైనా, నేటి అగ్రరాజ్యాల నేతలైనా అన్నికాలాల్లో వారి ఆధిపత్యకాంక్షే యుద్ధానికి బీజం వేస్తుంది. జనజీవనాన్ని అతలాకుతలం చేస్తుంది. అలాంటి యుద్ధబీభత్సంలోని లోతుపాతుల్ని స్పృశిస్తూ ఒక చారిత్రక యుద్ధబీభత్సం నేపథ్యంలో ఒక సైనికుడి సుతిమెత్తని ప్రేమకథ ద్వారా యుద్ధ పర్యవసానాలను వివరిస్తూ, ఆ సైనికుడి అతరంగమథనం ద్వారా యుద్ధసమయంలో మనిషిలో కలిగే భావోద్వేగాలకు అక్షరరూపమిస్తూ వర్తమాన రచయిత మారుతి పౌరోహితం వేలువరించిన నవల 'ప్రణయహంపీ'.

చరిత్రలో ఎంతో వైభవాన్ని సంతరించుకున్న విజయనగర సామ్రాజ్యాన్ని గురించి లెక్కకుమించి గ్రంథాలు వెలువడ్డాయి. ఆ విజయనగరానికి రాజధానిగా భావించే హంపీ నగరం ఒక యుద్ధం కారణంగా కళావిహీనమై నాశనమైపోవడం చరిత్రలో ఒక మరకగా మిగిలిపోయింది. ఆ యుద్ధమే ఈ నవల నేపథ్యమైంది. ఆ యుద్ధంలో జనజీవితం ఎంతగా అతలకుతలమైందో తెలుపుతూ ఆ జనజీవితంలో భాగమైన ఒక ప్రేమకథ ద్వారా తన యుద్ధనిరసన వ్యక్తంచేయడం ఈ రచయిత లక్ష్యంగా కనిపిస్తుంది. ఆ ప్రేమకథే ఆ సామ్రాజ్య వైభవంతో బాటు యుద్ధం వల్ల కలిగిన దాని పతనాన్నీ చెబుతూ మనల్ని ఉద్విగ్న క్షణాల్లోకి తీసుకెళుతుంది. యుద్ధానంతర హృదయపరితాపానికి లోనుచేస్తుంది. ఆది నుంచి చివరివరకూ సాగే ఈ రచయిత శైలీవిన్యాసం ఆ ఉద్విగ్నక్షణాలకు మెరుగులు పెట్టింది. ఇది ఈ రచయితకు మొదటి నవలే అయినా అలతి అలతి సంభాషణలు, సన్నివేశాల అల్లికతో మనల్ని కథనంతో కట్టిపడేస్తుంది. ఆద్యంతం చదివిస్తుంది. ప్రళయహంపీలో ప్రణయహంపీని దర్శింపజేస్తుంది. గ్రామీణ జీవనసౌందర్యంతో బాటు ప్రపంచీకరణ నేపథ్యంలో ఆ గ్రామీణ జీవన పార్శ్వాలు ఎంతగా కళావిహీనమైపోతున్నాయో చెబుతూ గతంలో ఈ రచయిత తన ప్రాంతమైన కర్నూలు మాండలికపు నుడికారాలతో వెలువరించిన 'ఊరుమర్లు' కథసంపుటి ప్రశంసలు అందుకుంది. ఇప్పుడు రచయిత అవలంభించిన కథనపద్ధతి వల్ల ఈ నవల ఒక చారిత్రక సంఘటనలోని పలు పార్శ్వాలను దర్శింపజేయడమే కాకుండా పలు ఆలోచనలనూ రేకెత్తిస్తుంది. యుద్ధం, ప్రణయంల మధ్య ఒక సైనికుడు అనుభవించే మానసిక సంఘర్షణలోంచి ఈ నవలను నడిపించడం రచయిత విలక్షణ శైలిగా కనిపిస్తుంది. విజయనగర రాజుల ఏలుబడిలో ఎంతో వైభవాన్ని సంతరించుకున్న హంపీ నగరం విజయనగర రాజులతో రక్కసి, తంగడి ప్రాతాల్లో జరిగిన పంచపాదుషాల భీకర యుద్ధం తరువాత నవాబుల దాడులకు గురై ఎంతగా పతనమై కలావిహీనమైపోయిందో ఆ చారిత్రక అంశమే ఈ నవల భూమికగా కనిపిస్తుంది. ఆ అంశం నేపథ్యంలోనే ఒక ప్రేమజంటలో యుద్ధం గురించి చెలరేగే సంఘర్షణను రచయిత సామాన్య జనజీవితంతో అనుసంధానం చేస్తాడు. ఆ సంఘర్షణ ద్వారా యుద్ధ పరిణామాలనూ, పరితాపాలనూ వివరిస్తాడు.


శ్రీకృష్ణదేవరాయల అల్లుడు అళియ రామరాయల పాలనలో దసరా ఉత్సవాల సందర్భంగా జరిగిన అడవిదున్నతో పోరాడే పోటీలో తన సాహసంతో ఆ దున్నతల నరికి రాజు అంతరంగిక అంగరక్షకునిగా నియమితుడయ్యే సంబజ్జగౌడ ఈ నవలలో కథానాయకుడు. ఆ ఉత్సవాల్లో కూచిపూడి నృత్యప్రదర్శన ఇవ్వడానికి వచ్చి అతని ప్రేమను సంపాదించుకున్న నర్తకి ముద్దుకుప్పాయి కథానాయకి. వీరిమధ్య జరిగే హృదయంగమైన ప్రేమగాథ ఈ నవలలో సమాంతరంగా సాగుతుంటుంది. ఈ ప్రేమగాథకు యుద్ధం అనే ఉపద్రవం అడ్డుతగులుతుంది. విజయనగర సామ్రాజ్యం మీద కన్నేసిన పంచపాదుషాలు(అహమ్మద్ నగర్, బీజాపూర్, బీదర్, బేరార్, గోల్కొండ నవాబులు) దండెత్తడానికి పూనుకుంటారు. ఇరుపక్షాల మధ్య జరిగిన భీకర యుద్ధంలో హంపి నగరం శిథిలమైపోతుంది. వేలాదిమంది జనం బలైపోతారు. నవాబులు పన్నిన పన్నాగాల కారణంగా అళియ రామరాయలు, మరికొందరు రాజులు వారి చేతిలో మృత్యువాత పడతారు. అయితే ఒకప్పుడు తనను తండ్రిలా ఆదరించిన అళియ రామరాయల పట్ల కృతజ్ఞతతో బీజాపూర్ నవాబు ఆలీ అదిల్షా తన చేతికి బందీగా చిక్కిన సంబజ్జగౌడను అతనిని తాను త్రవ్వించే బావి పనులకు ఉపయోగించుకుంటాడు. ఆ పనులకు పర్యవక్షకుడిగా వ్యవహరించే సల్మా అహమ్మద్ ఫరూకీ సంబజ్జగౌడ ప్రేమగాథ విని ముగ్ధుడై అతడిని అతని ప్రియురాలితో కలపాలని నిశ్చయించుకొని అతడు బ్రతికే వున్నాడన్న వార్తను ఒక వేగు ద్వారా మహామంత్రికి చేరవేస్తే మహామంత్రి ముద్దుకుప్పాయికి తెలియజేస్తాడు. ముద్దుకుప్పాయి తన తల్లితో కలిసి ఆలీ అదిల్షా ఆస్థానానికి వెళ్లి తన నృత్యప్రదర్శనతో అతనిని మెప్పించి తన ప్రియుడిని దక్కించుకుంటుంది.

ఈ నవలలో సంబజ్జగౌడ పాత్రను రచయిత ఎంతో ఉదాత్తంగా చిత్రించాడు. ఆ పాత్ర ద్వారానే విజయనర సామ్రాజ్యానికి సంబంధించిన అనేక అంశాలను వెల్లడింపజేయడం రచయిత ఎత్తుగడగా భావించవచ్చు. ఒక సామాన్యుడికి ప్రతినిధిగా కనిపించే అతని ఆలోచనల్లో పలుసార్లు యుద్ధవ్యతిరేక ప్రస్తావన తీసుకువస్తాడు. అతడు పోటీలో గెలవబోయే ముందు తాను తలనరికే అడవిదున్నకు నమస్కరించడం అతడి వినయంతో కూడిన వ్యక్తిత్వాన్ని తెలియజేస్తుంది. అతడు అళియ రామరాయలు అంతరంగిక అంగరక్షకుడిగా నియమితుడైన తరువాత అంతఃపురంలో జరిగే అనేక విషయాలను రచయిత అతడి చేతే చెప్పిస్తాడు. ముఖ్యంగా అంతఃపురంలో రాణులు బందీలలా జీవనాన్ని వెళ్లబుచ్చడాన్నీ, వారికి రాజులు స్త్రీలను, హిజ్రాలను మాత్రమే పర్యవేక్షకులుగా నియమించడాన్నీ అతడు స్త్రీవాద దృక్పథంతో ఆలోచించి అసంతృప్తి చెందుతాడు. యుద్ధశిబిరంలో సైనికులను ఉత్సాహపరిచేందుకు వినియోగించే వేశ్యలకు ప్రతినిధిగా కనిపించే వలంది పాత్ర ద్వారా ఆ వేశ్యలలో చాలామంది సైనికుల కారణంగా అనారోగ్యానికి గురై మృతిచెందిన విషయాన్ని తెలుసుకొని వారిపట్ల కొండంత సానుభూతిని వ్యక్తం చేస్తాడు. దాదాపు ఐదునెలల పాడు జీగిన భీకర యుద్ధంలో వేలాదిమంది మృతిచెందాక సంబజ్జగౌడలో కలిగే మానసిక సంఘర్షణను రచయిత వివరిస్తాడిలా... 'యుద్ధం నేరమని లేదా దానిని అంగీకరించడం నేరపూరిత వైఖరి అని అతడు భావించలేదు. అది భయంకరమైనది, అగ్ని వంటిది అని గ్రహిస్తున్నాడు. దాని ఇంధనం జీవరాశులనీ, ఏ సైనికుడు కూడా యుద్ధంలో తాను గాయపడాలనీ, చనిపోవాలనీ కోరుకోడని, తమ ప్రియమైన వారెవరూ తమకు అలాంటి హాని జరగకూడదనే కోరుకుంటారని అతడు గ్రహిస్తున్నాడు'.... సంబజ్జగౌడ ముద్దుకుప్పాయికి జరగబోయే యుద్ధం గురించి తెలిపే సందర్భంలో 'సుదీర్ఘ యుద్ధం నుంచి ఏ రాజ్యం కూడా ప్రయోజనం పొందిన సందర్భం లేదు' అంటూ యుద్ధవ్యతిరేకతను వ్యక్తం చేస్తాడు.

ఈ నవలను ప్రధానంగా ముందుకు నడిపేంచే సంబజ్జగౌడ, ముద్దుకుప్పాయిల లవ్ ట్రాక్ ను రచయిత ఎంతో నిబద్ధతతో, బ్యాలెన్సుతో తీర్చిదిద్దాడు. 'సంబజ్జగౌడను గుర్తుచేసుకోవడం ఆమెకు వర్షం వచ్చిన తరువాత వెచ్చని అనుభూతి ఇచ్చే సూర్యరశ్మిలా వుంటుంది'... 'ఆమె అతడి గురించి ఆలోచించినప్పుడల్లా ఒక నక్షత్రం రాలిపోయినట్లైతే ఈపాటికి ఆకాశం ఖాళీ అయ్యుండేది'... 'నీవు లేకుండా వంద సంవత్సరాలు జీవించడం కంటే రేపు చనిపోవడమే నాకు ఇష్టం'... వంటి వర్ణనలతో రచయిత ఉత్తమ ప్రేమికురాలిగా ముద్దుకుప్పాయి ప్రణయపు ఆలోచనలను ద్విగుణీకృతం చేస్తాడు. అందుకే ఈ నవలలో ముద్దుకుప్పాయి మరో ఉదాత్త పాత్రగా కనిపిస్తుంది. సంప్రదాయం ప్రకారం రాజుకోసం నర్తకిగానే వుండిపోవలసిన ఆమె సంబజ్జగౌడను మనసావాచా కోరుకుంటుంది. అతడిని యుద్ధానికి సాగనంపేటప్పుడు 'సైనికుడిని ప్రేమించడం కష్టంకాదు. దూరం కష్టం. ఆందోళన కష్టం. త్యాగాలు కష్టం' అంటూ తనలోని ఆవేదనను వ్యక్తం చేస్తుంది. అతడే తన భర్త కావాలని పౌర్ణమి రోజున సిరిమాను ఉత్సవంలో ఎంతో కష్టమైన సిరిమానును కూడా ఆడుతుంది. తన నృత్యప్రదర్శనతో, వాక్పటిమతో ఆలీ అదిల్షాను మెప్పించి సంబజ్జగౌడను దక్కించుకుంటుంది. వేశ్యలను శుభశకునానికి ప్రతీకగా భావించి తమ ఆస్థానాల్లో వారికి స్థానం కల్పించినా వారిచేత వృత్తిపన్ను చెల్లింపజేయడం, సైనికులకు విలాసవస్తువులుగా చేయడం వంటి అంశాల్లో వారి జీవితాల్ని అతలాకుతలం చేసేంతగా ఆనాటి విజయనగర రాజులు వారి పట్ల వ్యవహరించిన దురహంకారాన్ని వలంది పాత్ర ద్వారా రచయిత బట్టబయలు చేస్తాడు. నవల ముగింపులో సంబజ్జగౌడ, ముద్దుకుప్పాయిలు తమకు జన్మించే కుమార్తెకు వలంది పేరును పెట్టుకోవడం ఆ పాత్ర ఔచిత్యాన్ని తెలియజేస్తుంది.


ఈ నవలలో విజయనగర సామ్రాజ్యానికి సంబంధించిన పలు అంశాలను వెల్లడించడంలో రచయిత పరిశోధనాత్మక దృష్టి పేర్కొనదగినది. పలు గ్రంథాల అధ్యయనంతో తాను సేకరించిన సమాచారాన్ని సంగ్రహంగానే, తగినపాళ్లలోనే సందర్భానుసారం నవలలో అల్లిక చేయడం మనకు ఆనాటి వైభవాన్ని కళ్లకు కట్టినట్టు దర్శింపజేస్తుంది. అళియ రామరాయలు తన సైన్యాన్ని యుద్ధానికి సన్నద్ధం చేసేటప్పుడు 'యుద్ధ వీరణములు అయిన శంఖు, కాహళ ఢక్కాదిక్కులు పిక్కటిల్లేలా మారుమ్రోగాయి. ఏనుగు దంతములకు పెద్దపెద్ద కత్తులు కట్టారు. గుర్రపు సేనలోని పఠానులు అనేకమంది జులపాలకు నూనెరాసి దువ్వి మెరుగిచ్చి వాటిపై జరీపాగాలు చుట్టారు. వారు తాంబులాలు నమిలినందున నోళ్లు ఎరుపెక్కి వున్నవి. వారి గుర్రములపై బారులు తీరి రాజునకు సలాములు చేశారు'... వంటి వర్ణనలు రచయిత పరిశోధనాత్మక దృష్టిని తెలియజేస్తుంది. యుద్ధవ్యతిరేకతనే ఈ నవల పలు సందర్భాల్లో ఉద్బోధిస్తుంది. హంపీ నగరంపై పాదుషాలు దాడులకు పాల్పడినప్పుడు అక్కడి జనం చెల్లాచెదురై జనజీవనం కకావిలమైన సందర్భంలో రచయిత 'మనం భూమిపై యుద్ధాన్ని రద్దు చేయకపోతే, ఖచ్చితంగా ఒక రోజు యుద్ధం భూమినుంచి మనల్ని రద్దు చేస్తుంది' అంటూ తన అభిమతాన్ని తెలియజేస్తాడు. సంబజ్జగౌడ ప్రేమకథను సుఖాంతం చేయాలని, అతనికి సాయపడాలనుకున్న సల్మా అహమ్మద్ చేత రచయిత 'యుద్ధం మానవ జీవితానికి అసహజ ముగింపు. యుద్ధం మూలంగా ఒక రాజ్యం యవ్వనం నశించిపోతుంది. వృద్ధాప్యం మిగిలిపోతుంది' అని పలికిస్తాడు. 'యుద్ధం అంటే మరణభయంతో చేసుకునే ఆత్మహత్య. యుద్ధభూమిలో మరణిస్తున్న సైనికుడి కళ్లలోకి చూసిన ఎవరైనా యుద్ధాన్ని ప్రారంభించేముందు తీవ్రంగా ఆలోచి

# అనుభవాల ఊట పల్లేరు కాయలు




తెలుగు సాహితీ వనంలో పేరుపొందిన రచయిత డాక్టర్ బి వి ఎన్ స్వామి ఎనిమిది వ్యాస సంపుటాలు రెండు కథా సంపుటాలు రెండు కశప( కథా శతక పద్యం) ఒక నవల వెరసి 13 పుస్తకాలు వెలువరించారు ఇటీవల వీరు వెలువరించిన పల్లేరు కాయలు స్వీయ జీవిత కథాత్మక నవల తల్లి ఆరోగ్య బాధ్యతలను చిన్నప్పుడే తలకెత్తుకున్న అనుభవం భవిష్యత్తులో ఉపయోగపడటం నవలలో కనిపిస్తుంది. తెలంగాణ అంటేనే ఉద్యమం ఉద్యమం అంటేనే తెలంగాణ అన్న నానుడి ని పట్టిచూపుతున్నట్టుగా నవల ప్రారంభమే ఉద్యమ ప్రస్థానంతో ప్రారంభమవుతుంది దాంతో పాఠకుడు వెంటనే దానికి అనుసంధానమై ఆసక్తిగా చదువుతూ ముందుకు వెళ్లగలిగేలా నవల సాగుతుంది. తనకు చిన్ననాట విద్య నేర్పిన గురువుల్లో తను అమితంగా గౌరవించిన భట్టు సార్ బోధనా పద్ధతిని గురించి చెబుతూ ఆయన బోధించే విధానం సాలెగూడులా ఉండేది విద్యార్థులందరూ ఆ గూడులో చిక్కుకోవాల్సిందే నిన్న చెప్పిన పాఠం నేటి పాఠానికి నాంది ప్రస్తావన నేటి పాఠం రేపటికి ఇంటి పని ఈ రెంటి మధ్య నిరంతర మూల్యాంకనం జరిగేది ఆయన ఉద్యోగ జీవితమంతా ఇదే క్రమంలో జరిగింది అంటూ స్మరించుకుంటాడు అటువంటి ఉపాధ్యాయుని జీవితమంతా గుర్తుపెట్టుకున్న స్వామి లాంటి శిష్యుడు ఉండడం ఆ గురువు అదృష్టం ఇప్పుడు అటువంటి గురువులు లేరు ఇటువంటి శిష్యులు లేరు ఇప్పటి విద్యా వ్యవస్థ తీరుతెన్నులను తరచి చూస్తే నులక మంచంలో చెద్దర్ పరవకుండా నూకలు ఆరబోసిన చందాన కనపడుతుంది తల్లికి సహాయకుడిగా దావఖానలో ఉన్నప్పుడు స్వామికి ఒక నర్సు ఎదురవుతుంది ఆమెను చేపట్టిన భూస్వామి ఆమె ఇంట్లోనే ఉండేవాడు స్వామి చిన్నప్పుడు అతని స్నేహితుని సోదరి పటేల్ ఇంట్లో ఉండేది ఈ రెండు సందర్భాల్లోనూ స్త్రీలకు వ్యతిరేకంగా గుసగుసలు వినపడతాయి స్త్రీల పట్ల ప్రదర్శితమైన వివక్షకు రచయిత ఆనాడే ఇబ్బంది పడ్డాడు ఇది స్వామి వ్యక్తిత్వానికి అద్దం పడుతుంది తెలంగాణలో బతుకమ్మ దసరాలు పెద్ద పండుగలు దసరా పండగ సంబరాల్లో ఊళ్లో ఉండే వైరి వర్గాల మధ్య సంఘర్షణలు ఎన్ని జరిగినా కేసులు ఉండేవి కావు ఈ వెసులుబాటును వైరీవర్గాలు ఉపయోగించుకునేవి ఆ పండగ సందర్భాన్ని స్వామి కళ్ళకు కట్టినట్టు చిత్రించాడు ఆనాటి వాతావరణంలో సంబంధం ఉన్నవారు నాటి జ్ఞాపకాల్లోకి వెళ్లేలా రాయగలిగాడు క్రమశిక్షణ పేరా పిల్లలను నియంత్రించడం వారి వికాసానికి అవరోధం అని రచయిత బలంగా చెప్పాడు సున్నితమైన ఈ అంశాన్ని జీవిత నేపథ్యంగా వివరించాడు ఉపాధ్యాయ సంఘాల రాజకీయాలు నాయకుల ఆశ్రితపక్షపాతాలు స్వార్థపరత్వాలు చూసి వాటి ప్రభావాలు ఉపాధ్యాయులపై ఏ విధంగా ఉండేవో ఎత్తిచూపాడు తన కెరీర్ ఎదగడంలో ఒక ఉపాధ్యాయురాలు అందించిన సహాయ సహకారాలను కూడా హృద్యంగా వివరించారు ఒకటి రెండు చోట్ల అనవసర విషయాలను చెప్పినట్లు అనిపించినా మొత్తంగా నవల అనేక విషయాలను అందించింది రచయిత తన మొదటి ప్రయత్నంలోనే మంచి నవలను అందించడం ముదావహం.

**శిరంశెట్టి కాంతారావు**



## నిలకడ పైన నీలి మేఘాలు సాగవులే

జాతి కెరటాలు జాగృతి భూతమై నవీన
యుగపు జీవన సంగీతాన్ని ఆలపించడం
రనగనుల మధ్య యంత్రం లాగా నడిచే
మనిషికి

మనిషి తత్వం కోల్పోయి కృత్రిమ మేదతో
నడుస్తున్న జీవనమిది

నిరాశలను వీడి ఆశావాదంతో అలస
టేరుగాని నిరంతరపు ప్రయాణికులు
అందరూ ఎక్కడినుంచి ఎక్కడికి ఎవరు
బయలుదేరుతారు ఎక్కడినుంచి ఎక్కడికి
ఏమి ఏమేమి సృష్టిస్తారు ఎవరి మేదస్సు
లో ఏ భావన ప్రపంచం ఉందో ఎవరికి
తెలుసు

సృజన కాల నిధి
దీర్ఘమైన కాల యామిని కనిపించని
ఎన్నో భావాలకు వినిపించే ప్రతి అక్షరం
లో రసభావాలు జీవన గీతాలు మధుర
ఫలాలు విషాద రాగాలు వినిపిస్తూనే
ఉంటాయి కాలగమనవృత్తంలో

నిలిచిపోయే జీవితం ఇది తలుచుకుంటే
చెప్పలేని అనే కానేకా గాధలు వైవిధ్యాలు
విచిత్రాలు విలక్షణాలు విస్తృతాలు కొన
సాగుతూనే ఉన్నాయి....

డాక్టర్ అంజనా
శ్రీ కంభం భువనగిరి కోట
7702537453